▼ ఈవారం కథ



# అమ్మకానికి...

—ఎస్. నూర్ అహ్మద్

చుట్టూ ఎటు చూసినా మాడిపోయిన రైతుల ఆశల్లా ఎండిపోయి నేలకు తలవాల్చిన వేరుశెనగ పైర్లతో నిండిన ఆ ఎర్రనేలలపై మధ్యాహ్నపు మండుటెండ తీక్షణంగా కురుస్తోంది.

ఎండల వేడిమికి తట్టుకోలేక జీవచ్ఛవమౌతున్న నేలతల్లి కొన ఊపిరిలా అప్పుడప్పుడూ సుడిగాలి ప్రత్యక్షమై గింగిరాలు తిరుగుతూ పైకి వెళ్ళిపోతోంది. కనుచూపు మేరలో పచ్చని చెట్టంటూ కనిపించని ఆ నిర్జన ప్రాంతంలో పంటచేల మధ్య నుండి ఒంటరిగా సాగిపోయే బండి జాడతో కలిసి వెళ్తున్నాడు రామిరెడ్డి ...

అతని మనసులోని బరువంతా పాదాల్లోకి వచ్చినట్లుగా నిస్సత్తువతో బరువుగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడతను.

అకాలంలోనే నెరిసిపోయిన జుట్టు, మాసిపోయిన గెడ్డం, విచారంతో కృంగిపోయినట్లుగా లోతుకు వెళ్ళిపోయిన కళ్ళు, గుంతలు పడిన చెంపలు, గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోయేలా వున్న బక్క దేహం, దానిపై మాసిన తెల్ల చొక్కా, భుజంపై ఓ తువ్వాలు, పైకి మడిచి కట్టిన అడ్డపంచె, కాళ్ళకు ముతక చెప్పులు కలిస్తే అది రామిరెడ్డి స్వరూపం.

ఉదయపు నీరెండలు ఇంకా రాకముందు నుండీ నడుస్తున్న రామిరెడ్డి అప్పటికే బాగా అలసిపోయాడు. అయినా ఏ చెట్టు నీడనో విశ్రమిద్దామని అనుకున్నా అది తీరని కోరిక కావడంతో నెత్తిన తువ్వాలు వేసుకొని సాగిపోతూనే వున్నాడు.

మండిపోతున్న ఎండలకు గుర్తుగా కారిపోతున్న చెమటలను ఆ తువ్వాలుతోనే తుడుచుకుంటూ ఓసారి వెనుదిరిగి చూశాడు.

అతనికి కాసింత దూరంలో రెండు ఎద్దులు మెల్లగా వస్తూ కన్పించాయి.

అవి తాను ప్రాణప్రదంగా పెంచుకున్నవి.

తాను పగ్గం వేసి పట్టుకురాకున్నా తనపై ప్రేమతో తనను అనుసరిస్తున్నాయి.

తను వాటిని అమ్మెయ్యబోతున్నాడు!

అవును! వాటిని అమ్మకపోతే గత్యంతరం లేదు తనకు.

అవి పశువులే! బరువులు మోయడానికీ, బలికావడానికీ పుట్టాయి.

అయినా ఎనిమిదేళ్ళుగా వాటితో తాను పెంచుకున్న అనుబంధం గుర్తొచ్చింది. ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం వాగులమడక జాతరలో కొన్నాడవి. కొత్తగా తెచ్చినప్పుడు కూడా అవి ఏనాడూ తనను ఇబ్బంది పెట్టలేదు. పైగా తన మనసెరిగినట్లు పనిచేసేవి. తాను పిలిస్తే పలికేవి.

పొలంలో పనిచేసి అలసిపోయినప్పుడు, బండిలో ఇంటికి వస్తూ అందులోనే నిద్రపోయినా అవి సరాసరి ఇంటి వద్దకు చేర్చేవి.

ఏ అర్థరాత్రో పట్నం నుండి తాను తిరిగొస్తే తనను చూసి సంతోషంగా అరుస్తుండేవి. ఆ అరుపులో ఎన్నో ఆప్యాయతలు పలుకుతుండేవి. వాటి కష్టానికి తగినట్లుగా తాను మంచి తిండి పెట్టడంతో పాటుగా నెలకోసారి ఏ నీళ్ళ పంపుసెట్ల దగ్గరకో తీసుకెళ్ళి వళ్ళంతా తోమి స్నానం చేయించేవాడు.

పైపెచ్చు బండికి కట్టినా ఏనాడూ వాటిని ఒక దెబ్బ కొట్టి ఎరగడు.

అలాంటి ఎడ్లను తాను అమ్మేయబోతున్నానని తలుచుకున్నప్పుడు అతని కంట్లో నీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి.

వాటిని అమ్మితే ఏమౌతుంది?

చంపేస్తారు వాటిని, కోసి అమ్మేస్తారు. ఇది తనకు తెలుసు. అయినా అమ్మేయబోతున్నాడు. ఆ మూగ జీవాల పట్ల ఎంతో ప్రేమ నింపుకున్న తన గుండెలు వాటిని తన చేతుల మీదుగా బలిచేసేంత బండగా ఎప్పుడు మారిపోయాయో తనకే తెలియడం లేదు.

తన గ్రామం నుండి ఆదివారం ఉదయాన్నే ఎడ్లను తోలుకొని గోరంట్ల సంతకు బయలుదేరాడతను.

సంత సోమవారంనాడు జరుగుతుంది. అందుకే ఆదివారం రాత్రి అక్కడకు చేరాలనే నడుస్తున్నాడు రామిరెడ్డి.

అడ్డదారుల వెంబడి నడుస్తున్న అతనికి విపరీతమైన దాహం వేస్తోంది. నీటిచుక్క కోసం నాలుక పిడచగట్టుకపోతోంది.

అయినా అతను దాహంతో బాధపడుతూనే

తనకు ఎదురైన ఊర్లు దాటుకుంటూ నడుస్తున్నాడు.

అతనికి తాగడానికి నీళ్ళు దొరక్క కాదు. తనకు ఎవర్ని అడిగినా నీళ్ళు పోస్తారు. కానీ తనతోపాటు దప్పికగొన్న ఎడ్లకు నీళ్ళు ఎవరిస్తారు?

తానొక్కడే నీళ్ళు తాగితే ఆ నీళ్ళ వైపు ఆశగా చూసే ఆ మూగ జీవాల చూపును తాను తట్టుకోలేడు.

అందుకే దాహం బాధిస్తున్నా దీక్షగా సాగిపోతున్నాడు.

సూర్యుడు తన కర్తవ్య నిర్వహణ చాలించి, పడమటి కనుమల చాటున విశ్రమించడానికి చేరిన మలిసంజె వేళలో, మసక చీకట్ల మధ్య అతను గోరంట్ల చేరాడు.

ఊరికి ముందుగా ఎదురొచ్చిన సంత మైదాన సమీపంలో ఎవరో పుణ్యాత్ములు కట్టించిన నీటి తొట్టిలో తన ఎడ్లకు నీళ్ళు తాగించాడు.

ఆ తర్వాత ఊళ్ళోకి నడిచి తన వద్ద మిగిలిన చిల్లర డబ్బుతో ఒక టీ తాగి మళ్ళీ వెనక్కి వచ్చి చిత్రావతి ఒడ్డునే విశ్రమించాడు.

అయితే 60 కిలోమీటర్లు ఏకధాటిన నడక నొప్పులతో నిద్రను దరి చేరనివ్వక పోవడంతో మెలకువగా వుండే మేను వాల్చాడు.

తన ఎదురుగా కన్పిస్తున్న ఎండిపోయిన చిత్రావతి నదిని చూస్తుంటే అతని కళ్ళ ముందు తన నిన్నటి స్థితిగతులు కదలాడాయి.

* * *

అనంతమైన కరవుకు నిలయమైపోయిన అనంతపురం జిల్లాలో కరవుకు ప్రతిరూపాలైన దక్షిణ తాలూకాల్లోని మడకశిర ప్రాంతానికి చెందిన శిద్దరాంపురం గ్రామ నివాసి రామిరెడ్డి.

పుట్టి పెరిగిన ఆ ఊళ్ళో ఏడు ఎకరాల మెట్టభూమి వున్న ఓ మామూలు రైతు అతను. ఓ మూడేళ్ళ క్రితం వరకూ అతని పరిస్థితి కొంచెం మెరుగ్గానే వుండేది.

అయితే మూడేళ్ళుగా ప్రకృతి అతన్ని దెబ్బ మీద దెబ్బ కొట్టింది.

ఒక సంవత్సరం వర్షాలు అధికం కావడంతో నీరుబుడ్డ అయిపోయిన వేరుశెనగ నీళ్ళలో కలిసిపోయింది.

మరో సంవత్సరం ముందుగా తొలకరి వర్షాలు బాగాపడ్డాయి. వేరుశెనగ పంట కూడా ఎంతో బాగా పండి అందరు రైతుల్లో ఆశలు కల్పించింది. అయితే పంటను పీకే సమయానికి ఒక్క నీటి చుక్క కూడా పడకపోవడంతో భూమి అంతా ఎండిపోయి కరుడుగట్టిపోయింది. అతికష్టం మీద భూమిని తడిపి పంటను పీకినా పావు భాగం పంట కూడా చేతికి రాలేదు. ఆ వచ్చిన పంట పెట్టుబడిని కూడా తేలేక నష్టాలను నెత్తినవేసింది.

గత సంవత్సరం తొలకరి వర్షాలే సరిగా రాకపోవడంతో అసలు పంటే పెట్టుకోలేదతను.

అప్పుడే ఎవరో సలహా ఇచ్చారు పొలంలో బోర్ వేయించమని.

కానీ అంత డబ్బు తన వద్ద లేదు. ఒక వేళ వున్నా 400 అడుగుల లోతున బోర్ వేసినా నీళ్ళు పడతాయనే ఆశ లేదు.

అప్పటికే ఇల్లూ, పొలాలూ తాకట్టులోకి వెళ్ళిపోయి చాలా కాలం అయింది. ఇంట్లో కాస్త ఖరీదైన సామానులు అన్నీ అమ్ముడుపోయాయి. గత సంవత్సరమే తన తల్లికి ఆరోగ్యం తిరగబెట్టి ప్రాణాల మీదికి రావడంతో ఎద్దుల బండిని అమ్మేశాడు. ఎద్దులు మాత్రం వుంచుకున్నాడు.

తన భార్య నరసమ్మ సౌమ్యురాలు కావడంతో ఎన్ని కష్టాలొచ్చినా కడుపులో పెట్టుకుంటుంది. మెడలో వున్న పసుపు కొమ్మును కొంగు చాటున దాచిపెడుతోంది.

తనకున్న పిల్లల్లో పన్నెండేళ్ళవాడు పెద్ద కొడుకు, మరో ఐదేళ్ళ పాప వున్నారు.

వారికి తోడు మంచాన్ని అంటిపెట్టుకుని ఎముకల గూడులా తల్లి వుంటుంది.

వీరిలో ఏ ఒక్కరూ తనవేనాడూ ఒక్క కోరిక కూడా కోరింది లేదు. తన పరిస్థితులు, స్థితిగతులు వారిని ఏమీ అడగనివ్వవు.

అయినా తనవారి కోసం తాను ఏమీ సంపాదించిపెట్టలేదని, వారి భవిష్యత్తు అంతా ఇప్పటికీ శూన్యమే అని తలుచుకుంటే రామిరెడ్డి హృదయం ద్రవించిపోతుంది.

అయితే ప్రతిసారీ మోసగించే ప్రకృతి ఎప్పటికైనా తనపై కరుణించకపోతుందా అని కొండంత ఆశ అతని మదిలో గూడుకట్టుకొని నిలిచిపోయింది. ఆ ఆశే అతన్ని, అతని కుటుంబాన్ని బ్రతికిస్తోంది.

ఈ సంవత్సరం మళ్ళీ తొలకరి వర్షాలు బాగా పడ్డాయి. రామిరెడ్డిలోనూ ఆశలు రెక్కలు విప్పాయి.

కానీ పంట పెట్టడానికి కావాల్సిన పెట్టుబడి అతని వద్ద లేనేలేదు.

ఉన్నదంతా తెగనమ్మేశాడు, బ్యాంకులు పరపతి సంఘాలలో అప్పులూ చేసేశాడు. ఇక ఎవరూ అప్పు ఇచ్చే సూచనలు కూడా లేవు. అసలు తింటానికే గగనమౌతుంటే ఇక పెట్టుబడి ఎలా వస్తుంది!

ఈ విషయమే ఓ రోజు రాత్రి భార్యతో చెప్పి బాధపడ్డాడు తను.

డబ్బుంటే దుక్కి దున్నించవచ్చునని, కానీ అందుకు తగిన సొమ్మే లేదని బాధపడ్డాడు. తన నిస్సహాయతకు తల బాదుకున్నాడు.

అయినా ఆమె మాత్రం చేయగలిగిందేమిటి?

అందుకే భర్తతోపాటు బాధపడుతూ వుండిపోయింది...

అయితే ఉదయాన్నే బయటికి వెళ్తున్న రామిరెడ్డిని తల్లి దగ్గరకు పిలిచింది. ఎముకల పోగులా కుక్కిమంచంలో పడి వున్న ఆ ముసలమ్మను చూస్తే ఎలాంటి వారికైనా అయ్యో పాపం అని



### చెవిలో పెన్ను

ఒకసారి మహాత్మాగాంధీని ప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు సి.వి. రామన్, స్విట్జర్లాండ్‌కి చెందిన రస్మో అనే ప్రొఫెసర్ కలుసుకున్నారు. రామన్ మాటల సందర్భంలో ప్రక్కనున్న ప్రొఫెసర్‌గార్ని గాంధీజీకి పరిచయం చేస్తూ "ఈయన ఒక పురుగును కనిపెట్టారు. అది ఆహారం తీసుకోకుండా, నీరు త్రాగకుండా 12 సంవత్సరాలు జీవించగలదు. ఇంకా మరెన్నో పరిశోధనలు చేయడానికి కవి ఇప్పుడు మన దేశం వచ్చారు" అని చెప్పారు. ఇదంతా ఎంతో ఓపికతో విన్న గాంధీజీ "ముందు ఆ పురుగు ఆహారం, నీళ్ళు లేకుండా ఎలా జీవిస్తుందో కనుక్కుని ఆ రహస్యం నాకు కూడా చెప్పండి" అని చమత్కరించారు.

సేకరణ :- చెన్నాప్రగడ, విజయవాడ

పిస్తుంది. అలాంటిది రామిరెడ్డి లాంటివారి మాట వేరుగా చెప్పాలా?

తన తల్లికి మంచి వైద్యం చేయించలేకపోతున్నాననే బాధ అతని మనస్సులో ఎప్పుడూ మెదులుతూనే వుంటుంది.

ఎన్నడూ లేనిది తల్లి తనవలా పిలిచేటప్పటికి ఆశ్చర్యపోయాడు.

అయినా "ఏమిటమ్మా" అని ఆప్యాయంగా దగ్గరికెళ్ళాడు.

"ఇదిగో బాబూ ఇవి తీసుకో..." చేతుల్ని ముందుకు చాచిందామె.

ఆమె మణికట్టుకు రెండు 'మురుగులు' చుట్టుకొని వున్నాయి. ఎప్పుడో తన పెళ్ళినాడు వేసుకున్న బంగారు మురుగులవి. అప్పట్నుంచీ ఆమెనే అంటిపెట్టుకున్నాయవి. తల్లి ఆ మాట చెప్పేటప్పటికి- తాను రాత్రి భార్యతో చెప్పిన మాటలు తల్లి విందని, అందుకే వాటిని తీసుకొమ్మంటోందనీ అర్థం అయింది రామిరెడ్డికి.

అయినా వాటిని తీసుకోవడానికి మనసు రాక వద్దన్నాడు.

కానీ ఆ తల్లి ఆయాసపడుతూనే అతనికి నచ్చజెప్పింది. తన తదనంతరం అవి ఎలాగూ అతనికి చెందేవే కాబట్టి తీసుకొమ్మంది.

చివరికి వణుకుతున్న ఆ ముసలి చేతుల నుండి మురుగుల్ని తీసుకుంటున్నప్పుడు రామిరెడ్డి కళ్ళు నీళ్ళతో నిండిపోగా, ఇక తట్టుకోలేక ఏడ్చేశాడతను.

ఆమె పైకి లేవలేకపోయినా అతని తల నిమిరి ఓదార్చింది. ధైర్యం చెప్పింది.

* * *

మురుగుల్ని అమ్మి తెచ్చిన డబ్బుతో రామిరెడ్డి భూమి సాగు చేయించి, విత్తనాలు వేయించి పంట పెట్టాడు.

వేసిన ఆ విత్తనాలు మొలకలెత్తి కాయలు కాసే తరుణానికి వాతావరణం విచిత్రంగా మారిపోయింది.

తడి ఆరిపోయిన గాలి, ఎండిపోయిన చెరువులు, కృంగిపోయిన బావులు, నదులతో మండిపోతున్న ఎండలు వర్షాకాలంలోనే నడి వేసవిని గుర్తుకు తెచ్చాయి.

ఫలితంగా అందరు రైతులు పెట్టిన పంటలతోపాటు తాను పెట్టిన పంట కూడా ఎండిపోయింది.

వాన కోసం చూసి చూసీ, పూజలు పునస్కారాలు చేసీ అలసిపోయారు రైతులు. గత్యంతరం లేక పంటలపై ఆశ వదులుకున్నారు.

రామిరెడ్డి ఆశలతోపాటు, అతని పెట్టుబడీ, శ్రమా కూడా మట్టిలో కలిసిపోయాయి.

ఓ నెల రోజులుగా తిండికి కూడా కటకట పడాల్సివచ్చింది.

తమకే కాదు-పశువులకు సైతం తిండీ, నీళ్ళూ లభించడం లేదు. గడ్డి మొలకలే మొలవ లేదు.

వ్యవసాయం గొడవలో పడి తన తల్లి సంగతి మరిచిన అతనికి గోరుచుట్టుపై రోకలి పోటన్నట్లుగా తల్లి అనారోగ్యం ప్రమాద పరిస్థితికి చేరుకోవడంతో కృంగిపోయాడు.

ఆమెను బెంగుళూరుకు తీసుకెళ్ళి వైద్యం చేయించడం మినహా మరో మార్గం లేదని డాక్టరు చెప్పడంతో కలవరపడ్డాడు.

కానీ వైద్యానికి కావాల్సిన డబ్బు తన దగ్గర లేదు.

అందుకే తనకు జన్మనిచ్చిన తల్లి కోసం గత్యంతరం లేక తనను నమ్మిన ఆ మూగ జీవాలను అమ్మబోయాడు...

* * *

ఉదయాన్నే సంతలో ఎడ్లను అమ్మేశాడు రామిరెడ్డి.

అతని ఎద్దుల జతకు వెయ్యి రూపాయలు వచ్చాయి.

ఆ ఎద్దుల్ని కొన్నవారికి అప్పగించి వస్తున్నప్పుడు అవి వెనుక నుండి అరుస్తూనే వున్నాయి. కానీ అక్కడ చేరిన వేలాది జీవాల అంభారావాలలో వాటి అరుపులు కూడా కలిసిపోయాయి.

అక్కడ అమ్మిన ఎద్దుల్ని కొన్నవారు వాటి కాళ్ళు విరగగొట్టి, బస్తాల్లాగా లారీలలో పేర్చి తీసుకెళ్తుంటే చూడలేక కంట తడిపెట్టుకున్నాడు.

ఏమీ చేయలేని నిస్సహాయతతో వెనుదిరిగాడు.

గోరంట్ల నుండి హిందూపురంకూ, అటు నుండి మడకశిరకూ బస్సులో వెళ్ళి తన గ్రామం చేరేటప్పటికే అతని కోసం ఓ వార్త ఎదురుచూస్తోంది.

ఏ తల్లి కోసం అయితే అతను అంత శ్రమపడి, తాను ప్రాణప్రదంగా పెంచుకున్న మూగ జీవాలను బలిచేశాడో ఆ తల్లే ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది.

తాను అంతగా ప్రేమించే తల్లి లేదని తెలిసినప్పుడు అతని గుండె దుఃఖంతో పగిలిపోవాలి. గుండె కరిగి కన్నీరై ప్రవహించాలి.

కానీ అలా జరగలేదు!!

దుఃఖాలను జయించిన అతీతశక్తుడిలా కన్నీళ్ళు కూడా కార్చలేదతను. చాలా మామూలుగా అతను తన తల్లి అంత్యక్రియల్ని జరిపించాడు. దాని కోసం తాను ఎద్దుల్ని అమ్మగా వచ్చిన సొమ్ము మొత్తం ఖర్చు పెట్టేశాడు.

అన్ని కార్యాలూ ముగిసిన తర్వాత అతని చేతిలో చిల్లిగవ్వ మిగలలేదు.

అయినా ఆకలి మిగిలింది, దుర్భర దారిద్ర్యం మిగిలిపోయింది.

అప్పటికే ఇక తనకు అప్పులు పుట్టవని, అమ్ముకోవడానికి కూడా ఏమీ మిగల్లేదని అర్థం అయిందతనికి.

అందుకే ఓ నిర్ణయానికి వచ్చాడతను...

* * *

మళ్ళీ మిట్ట మధ్యాహ్నపు మండుటెండలో అదే బండి జాడలో సాగిపోతున్నాడు రామిరెడ్డి.

అతని భుజంపై కూర్చొన్న పాప అతని తలపై, తలవాల్చి నిద్రపోతోంది.

అతని వెనుకగా నెత్తిన ఓ మూట, చేతిలో ఒక పెట్టెతో అతని భార్య.

మరో గుడ్డల మూట, ఒక చేతి సంచితో కొడుకు అనుసరిస్తున్నారు.

వెనుదిరిగి వాళ్ళ వైపు చూసే ధైర్యం రామిరెడ్డికి లేదు.

తనను కట్టుకున్న నేరానికి ఒకరూ, జన్మించిన నేరానికి ఇంకొకరూ కాలే కడుపులతో, రోడ్డుపట్టు బట్టలతో ఆ మండుటెండలో నడవడం చూసి భరించలేదు తను. అందుకే తన గమ్యం వైపు దీక్షగా సాగిపోతున్నాడు.

అదే దారిలో కొద్ది రోజుల క్రితం ఎద్దుల్ని అమ్మబోయిన రామిరెడ్డి, మళ్ళీ అదే దారిలో కూలి డబ్బులకు తనను తాను అమ్ముకోవడానికి వెళ్తున్నాడు.

అయితే అతనికి తెలియదు కథలు వేరైనా తాను ఎంచుకున్న గమ్యమే తమదిగా నిర్ణయించుకొని ఇంకెన్నో కుటుంబాలూ, మరెందరో రామిరెడ్లూ తనను అనుసరించి వస్తున్నారని... పట్టెడు మెతుకుల కోసం పడుతూ, లేస్తూ పిల్లాజెల్లాతో వెతుక్కుంటూ వెళుతున్నారని... ●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్